క్లుప్తంగా

ఆర్టీసీ కార్మికుల నిరసన


ఆర్టీసీ డిపో వద్ద ఆందోళన చేస్తున్న కార్మికులు

భీమవరం (ప్రకాశంచౌక్): డిపోలో అక్రమ సస్పెన్షన్ ఎత్తివేసి యూవీ రావును తక్షణం విధుల్లోకి తీసుకోవాలని నేషనల్ మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. మంగళవారం భోజన విరామ సమయంలో యూనియన్ నాయకులు ఎర్ర బ్యాడ్జీలు ధరించి నినాదాలు చేశారు. సంబంధం లేని వ్యక్తి ఇచ్చిన కంప్లైంట్‌పై పదే పదే విచారణ పేరుతో వేధించడం తగదన్నారు. నిరసనలో యూనియన్ నాయకులు పి.సోమరాజు, జిల్లా కార్యదర్శి వైవీ రావు, కట్టా రామారావు, సూర్యనారాయణ, ప్రకాష్‌బాబు, మేళం నాగబాబు, రమేష్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

బీఎస్ఐ క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న మోషేనురాజు

భీమవరం: ది బుద్ధి సొసైటీ ఆఫ్ ఇండియా (బీఎస్ఐ) నూతన క్యాలెండర్‌ను మంగళవారం శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేనురాజు ఆవిష్కరించారు. భీమవరంలో క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ది బుద్ధి సొసైటీ ఆఫ్ ఇండియా స్టేట్ వైస్ ప్రెసిడెంట్ కోనా జోషఫ్, జిల్లా ప్రెసిడెంట్ ఈది రవికుమార్, కేసీ రాజు, గాతల సందీప్, ఆదర్ రాజు, బేతాళ కమలాకర్, తదితరులు పాల్గొన్నారు.

అతి వేగం అనర్థదాయకం

భీమవరం: విద్యార్థులు వాహనాలు నడిపే సమయంలో అతి వేగం అనర్థదాయకమని, హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని జిల్లా రవాణా శాఖ అధికారి టి.ఉమామహేశ్వరరావు అన్నారు. మంగళవారం పట్టణంలోని ఆదిత్య డిగ్రీ కళాశాలలో జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ట్రాఫిక్ నిబంధనలు తప్పక పాటించాలన్నారు. ఈ సదస్సులో వాహన తనిఖీ అధికారి కేఎస్ఎస్ ప్రసాద్, ట్రాఫిక్ ఎస్సై గగరిన్, అసిస్టెంట్ మోటార్ హెహికల్ ఇన్‌స్పెక్టర్ ఏఎస్‌పీ తేజ, ప్రిన్సిపల్ ఎ.అనురాధ, డాక్టర్ హనుమ లక్ష్మి, మావుళ్ల, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

భీమవరం: పేదలకు ఉచితంగా ఇళ్ల స్థలాలు ఇస్తామన్న ప్రభుత్వ హామీని తక్షణమే అమలు చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు చెల్లబోయిన రంగారావు డిమాండ్ చేశారు. మంగళవారం సీపీఐ భీమవరం యానాదుల కాలనీలో పేదల నుంచి ఇళ్ల స్థలాల అర్జీలు స్వీకరించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్ల స్థలాలు ఇస్తామన్న హామీని అమలు చేయకపోవడంతో పేదలు సొంత గృహాలు లేక అద్దె ఇళ్లల్లో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా నాయకులు వైవీ ఆనంద్, ఎం.లక్ష్మీపతి, తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల విద్యార్థినులకు కొలువులు

వీరవాసరం: ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పాలకొల్లులో నిర్వహించిన మెగా ఉద్యోగ మేళాలో వీరవాసరం ఎస్ఎంబీటీ ఏపీ అండ్ ఎస్ఎస్ డిగ్రీ కళాశాల విద్యార్థులు 15 మంది పాల్గొనగా ముగ్గురు విద్యార్థినులు ఉద్యోగాలు పొందినట్లు కళాశాల ప్రిన్సిపాల్ వలవల నరసింహారావు మంగళవారం తెలియజేశారు. బీఎస్సీ కంప్యూటర్ ఆఖరి సంవత్సరం చదువుతున్న పంజా దైవ ప్రసన్న, విద్యంరెడ్డి విజయమణి, మేడిద మహేశ్వరి ఉద్యోగాలు సాధించినట్లు తెలిపారు. కొలువులు సాధించిన విద్యార్థినులను కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ వద్దినేడి సత్యనారాయణ అభినందించారు. కార్యక్రమంలో ప్లేస్‌మెంట్ అధికారి వి.దుర్గాప్రసాద్, ట్రైనింగ్ ఆఫీసర్, ఇంగ్లీషు లెక్చరర్ అద్దంకి మీనా పాల్గొన్నారు.

కుష్టు నివారణకు సహకరించాలి


డీఎంఅండ్‌హెచ్‌ఓ

భీమవరం (ప్రకాశంచౌక్): జాతీయ కుష్టు నిర్మూలన కేంద్రం వారి ఆధ్వర్యంలో పశ్చిమ గోదావరి జిల్లాలో ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది ఇంటింటి సర్వే చేస్తున్నారని, వారికి సహకరించాలని డీఎంఅండ్‌హెచ్‌ఓ భానునాయక్ తెలిపారు. సర్వేను ఈ నెల 20వ తేదీ నుంచి వచ్చే నెల 2 వరకు నిర్వహిస్తారన్నారు. అనుమానితులను గుర్తించి నిర్ధారించిన తర్వాత ఉచితంగా మందులు పంపిణీ చేస్తామన్నారు. శరీరంపై రాగి రంగు మచ్చలు, స్పర్శ లేని మచ్చలు, మచ్చలపై చెమట పట్టకపోవడం అరికాలు, చేతులు తిమ్మిర్లు, మొదలగు లక్షణాలు కలవారు ఆరోగ్య సిబ్బందిని సంప్రదించి తనిఖీ చేయించుకోవాలన్నారు. ప్రారంభ దశలో గుర్తిస్తే కుష్టు వ్యాధిని పూర్తిగా నిర్మూలించొచ్చని, అశ్రద్ధ చేస్తే అంగ వైకల్యం సంక్రమించొచ్చన్నారు. ఇప్పటి వరకు జిల్లాలో 229658 గృహాలు సర్వే చేసి 871713 మందిని పరీక్షించి, 11 కొత్త కేసులను గుర్తించి మందులు సరఫరా చేశామన్నారు.

రైతులకు దారేది బాబూ ?

- అన్నదాతలకు మేలు చేస్తామని నిండా ముంచిన చంద్రబాబు
- పుంత రోడ్ల నిర్మాణం ఊసెత్తని కూటమి ప్రభుత్వం


పెదపుల్లేరులో పొలాలకు వెళ్లేందుకు ఇబ్బందిగా మారిన పుంత రోడ్డు (ఫైల్)


మోగల్లులో నిర్మాణానికి నోచుకోని పుంత రోడ్డు

ఉండి: మాది రైతు ప్రభుత్వం, మేము అధికారంలోకి వస్తే రైతులకు స్వర్ణయుగమే అని అబద్ధ ప్రచారాలు, నోటికొచ్చిన వాగ్దానాలు చేసిన కూటమి ప్రభుత్వం రైతులను నిండా ముంచింది. చివరకు పొలానికి వెళ్లేందుకు రహదారులు కూడా కరువవ్వడంతో రైతులు పలు అవస్థలు పడుతున్నారు. నేరుగా రైతు తన పొలం వద్దే మట్టిలో కాలు పెట్టేలా అన్ని పుంత రోడ్లు వేసేస్తామని ప్రగల్భాలు పలికిన కూటమి ప్రజా ప్రతినిధులు ఇప్పుడు వాటిని కన్నెత్తి చూడటం లేదు. ఎవరు ముఖం చాటేసినా మాకు తప్పదన్నట్లు రైతు సోదరులు వారి పొలాల్లో పనులు చేసుకునేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పొలం వద్దకు నారు తీసుకెళ్లాలన్నా, ఎరువులు, పురుగు మందులు చేర్చేందుకు కనీసం ఆటోలు, ఎడ్ల బళ్లు వెళ్ల లేని దుర్భర స్థితిలో పుంత రోడ్లు దర్శనమిస్తున్నాయి. కోత కోసిన అనంతరం పొలాల నుంచి ధాన్యం ఒడ్డుకు చేర్చేందుకు రైతులు పడుతున్న పాట్లు వర్ణనాతీతం.

● ఆక్వా రైతు పరిస్థితి మరింత దారుణం

ఆక్వా జోన్‌లో ఉన్న ఉండి నియోజకవర్గంలో పెరిగిన చెరువులకు మౌలిక వసతులు మాత్రం శూన్యం . డాలర్ల రూపంలో విదేశీ మారక ద్రవ్యాన్ని తెచ్చి పెడుతున్న ఆక్వా రంగానికి కూటమి ప్రభుత్వం ఎటువంటి సదుపాయాలు కల్పించడం లేదని ఆక్వా రైతులు వాపోతున్నారు. టన్నుల కొద్దీ పట్టుబడి పట్టిన రొయ్యలు, చేపలను పుంతరోడ్ల ద్వారా ప్రధాన రహదారికి తేవాలంటే ట్రాక్టర్లు, ఆటోల్లో తరలించడంతో ఆక్వా రైతులు అధిక ఖర్చులతో తీవ్రంగా నష్టపోతున్నారు. అంతే కాకుండా చెవుల వద్దకు సున్నం, మందులు, మేత వంటివి తీసుకెళ్లాలన్నా, భారీ వాహనాలు వెళ్లేందుకు అవకాశం లేదు. అదే పుంత రోడ్ల నిర్మాణం జరిగితే చాలా వరకు మేలు కలుగుతుందని రైతులు ఎదురు చూస్తున్నారు. కనీసం ప్రధాన పుంత రోడ్డైనా నిర్మాణం చేస్తే రైతులకు కొంత ఊరటగా ఉంటుందని రైతులు ఆకాంక్షిస్తున్నారు.

● రైతు భరోసా కొండెక్కినట్టే

గత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రైతులకు పంట పెట్టుబడి కింద అందించే వైఎస్సార్ రైతు భరోసా రూ.15 వేలు కంటే తాము రూ.20 వేలు ఇస్తామని మోసపూరిత వలవేసి మోసగించారని రైతులు వాపోతున్నారు. చంద్రబాబు చేసిన ప్రకటనతో రైతులు తాము మోసపోయామని చంద్రబాబును నమ్మినందుకు తగిన బుద్ధి చెప్పాలని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతు భరోసా ఒక్కటే కాకుండా సంక్షేమానికి నిధులు లేవని చంద్రబాబు చెప్పడం విడ్డూరంగా ఉందని రైతులు ముక్కున వేలేసుకుంటున్నారు. ఇదే ప్రభుత్వాన్ని నడిపిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెప్పిన సమయానికి చెప్పినట్లు రైతు భరోసా నేరుగా రైతుల ఖాతాల్లో వేసేవారని ఆయనకు లేని ఇబ్బంది చంద్రబాబుకు ఎలా వచ్చిందని రైతులు ప్రశ్నిస్తున్నారు.

రైతును పట్టించుకునే నాధుడు లేడు



రైతులకు మేలు చేస్తానని చెప్పారు.ఏం చేసారు? కనీసం పుంత రోడ్లు నిర్మాణం కూడా చేపట్టలేదు.పొలాలకు వెళ్లాలన్నా ఇబ్బందే.పండిన ధాన్యం ఒడ్డుకు చేర్చాలన్నా ఇబ్బందే.ఇన్ని ఇబ్బందులు పడుతూ రైతుకు ఒడ్డుకు చేరితే వరికి మద్దత్తు ధర అంతంత మాత్రంగానే వుంది.తేమాలో ఏదైనా తేడావస్తే మద్దత్తు ధరలో తగ్గిస్తున్నారు.వెంటనే పుంతరోడ్లు నిర్మాణం చేపడితే రైతుకు కొంత వరకు మేలు జరుగుతుంది.

–నిమ్మల కేశవ కుమార్, రైతు, ఉప్పులూరు

ఆక్వా రైతులు నష్టపోతున్నారు



ఆక్వా చెరువుల్లో పట్టుబడి పట్టిన సరుకును ప్రధాన రహదారికి తేవాలంటే పుంతరోడ్లు లేక ఆక్వారైతులు పడుతున్నా పాట్లు చెప్పలేనన్ని వున్నాయి.అవి ఒక్కటే కాదు చెరువులకు మేతలు పట్టుకెళ్ళాలన్నా,మందులు వేయాలన్నా ఇలా ఒకటేంటి చెప్పలేనన్ని ఇబ్బందులు ఆక్వారైతులు పడుతున్నారు. అదే పుంతరోడ్లు నిర్మాణం చేపడితే రైతుకు ఒకొంత మేలు చేసినవారు అవుతారు. ఇప్పటికైనా పుంత రోడ్ల నిర్మాణంపై దృష్టి పెట్టండి.

–వఠ్రే పైడియ్య, ఆక్వా రైతు, పాములపర్రు

ఏరు దాటి తెప్ప తగలేశారు

కూటమి ప్రభుత్వంపై వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు అంబటి ఎద్దేవా


అంబటి రమేష్,

ఆకివీడు: ఏరు దాటి తెప్ప తగలేస్తారనే సామెతను చంద్రబాబు నిజం చేశారని వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షులు, మాజీ ఎంపీటీసీ అంబటి రమేష్ ఆరోపించారు. సూపర్ సిక్స్ పథకాన్ని అమలు చేయలేమంటూ చేతులెత్తేసిన చంద్రబాబు ప్రకటనపై మంగళవారం ఆయన తీవ్రంగా స్పందించారు. సిక్స్ కొట్టకుండానే బంతి మాయమైపోయిందని విమర్శించారు. చంద్రబాబు నైజం మరోసారి బట్టబయలైందని ఆరోపించారు. ఎన్నికల్లో గుప్పించిన వాగ్దానాలను గాలికొదిలేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన కొన్ని పథకాలను గత్యంతరం లేక పేర్లు మార్చి అమలు చేస్తున్నారన్నారు. ఏడు నెలల పాలనలో ప్రజలకు ఒరిగిందేమీ లేదన్నారు. కంటి తుడుపుగా పింఛన్లను పంపిణీ చేసి చేతులు దులుపుకున్నారని రమేష్ ఎద్దేవా చేశారు. ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని పరిస్థితిలో ఉన్నారన్నారు. పేద పిల్లల విద్యపై చంద్ర గ్రహణం పట్టిందని ఆయన ధ్వజమెత్తారు. అమ్మ ఒడి అడ్రస్సు లేదన్నారు. కూటమి ప్రభుత్వం కుట్రలతో పరిపాలన చేస్తుందన్నారు. ప్రజలు ఎదురు తిరిగే రోజులు దగ్గర పడ్డాయని హెచ్చరించారు.

పశువుల పెంపకంలో ప్రత్యేక శ్రద్ధ అవసరం


పశు వైద్య శిబిరంలో పేడ పరీక్షలు చేస్తున్న సహాయ సంచాలకుడు జి.మల్లేశ్వరరావు

ఆకివీడు: పశువుల పెంపకంలో యజమాన్య పద్ధతుల ద్వారా జాగ్రత్తలు పాటించాలని పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకుడు జి.మల్లేశ్వరరావు పిలుపునిచ్చారు. మండలంలోని సిద్ధాపురంలో పశు వైద్య శిబిరాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లేగ దూడ నుంచి సూడి కట్టే వరకూ పశువుల పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలన్నారు. లేగ దూడలకు మురిపాలు అధికంగా అందజేస్తూ, పాములు పట్టకుండా చూడాలన్నారు. పశువులకు వచ్చే వ్యాధుల నివారణకు ప్రభుత్వం అందజేసే టీకాలు, వ్యాక్సిన్లు అందజేయాలన్నారు. రైతులు పాల దిగుబడికి ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. శిబిరంలో మండల పశు వైద్యాధికారిణి కెల్లా భార్గవీసత్య మాట్లాడుతూ 38 పశువులకు గర్భకోశ వ్యాధి చికిత్సలు, 18 పశువులకు సూడి పరీక్షలు, 29 పశువులకు ఇతర పరీక్షలతో పాటు పేడ, రక్త పరీక్షలు నిర్వహించినట్లు చెప్పారు. అనంతరం పాడి రైతులకు మినరల్ మిక్చర్ ప్యాకెట్లు, నట్టల మందు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ చిగురుపాటి జయశీలుడు(చిట్టిబాబు), భూపతిరాజు తిమ్మరాజు, కందుల దుర్గా ప్రసాద్, చిదానంద మూర్తిరాజు, పశుసంవర్ధక శాఖ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయం ముట్టడి


రెవెన్యూ సిబ్బందికి వినతి పత్రం అందజేస్తున్న ఏఎస్సార్ కాలనీవాసులు

పాలకోడేరు: మండలంలలోని పాలకోడేరు గ్రామ శివారు ఏఎస్ఆర్ నగర్ పేదలకు ఇల్లు ఖాళీ చేయాలంటూ నాలుగు రోజుల క్రితం తహసీల్దార్, పంచాయతీ వారు ఇచ్చిన నోటీసులను ప్రజలు తీసుకోనంటే ఇళ్లకు అంటించి వెళ్లిపోయారు. తమ ఇళ్లకు నోటీసులు అంటించిన అధికారుల నిర్ణయాలను వ్యతిరేకిస్తూ మంగళవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద నోటీసులతో ఆఫీస్‌ను ముట్టడించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి శేషపు ఆశ్రీయ మాట్లాడుతూ గత 40 సంవత్సరాల నుంచి విష సర్పాలతో ప్రమాదకరమైన పరిస్థితుల్లో జీవించి రేకుల షెడ్లు నిర్మించుకున్న మమ్మల్ని కొందరి ప్రయోజనాల కోసం ఖాళీ చేయమనటం దుర్మార్గమైన చర్య అన్నారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే మా పేదల ఇల్లు అన్నిటికీ పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. డిప్యూటీ తహసీల్దార్‌కు ప్రజలు వ్యక్తిగత రిప్లై నోటీసులను అందించారు. డిప్యూటీ తహసీల్దార్ మాట్లాడుతూ మీ నోటీసులను పైఅధికారుల దష్టికి తీసుకెళతానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బైరి ఆదిలక్ష్మి, పెశ్చెట్టి సత్యనారాయణ, జోగి వరలక్ష్మి, సత్యనారాయణ, దున్నా మరియమ్మ, తమ్మినేడి వెంకటరమణ, గుడాల లక్ష్మి, దొంగ నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ విలువలను తగ్గించాలి


ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేస్తున్న చాంబర్ ఆఫ్ కామర్స్ సభ్యులు

భీమవరం: పట్టణంలో భూములు, స్థిరాస్తుల రిజిస్ట్రేషన్ విలువలు చాలా అధికంగా ఉన్నాయని, వాటి విలువల పెంపుదల నుంచి మినహాయింపు ఇవ్వాలని ది భీమవరం చాంబర్ ఆఫ్ కామర్స్ సభ్యులు ఎమ్మెల్యే అంజిబాబును కోరారు. మంగళవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులకు వినతిపత్రాన్ని అందించారు. కామర్స్ సభ్యులు మాట్లాడుతూ భీమవరం జిల్లా కేంద్రంగా ప్రకటించినప్పటి నుంచి ప్రత్యేకంగా రిజిస్ట్రేషన్ విలువలు అత్యధికంగా పెరిగాయని, ప్రస్తుతం భీమవరం పట్టణ పరిసర ప్రాంతాల వారికి ఆదాయ వనరులైన వ్యవసాయం, ఆక్వా తీవ్రమైన ఒడిదుడుకులతో నష్టపోయి ఉందని, అదీగాక రిజిస్ట్రేషన్ విలువలు పెరిగినందున ఆస్తి పన్నులు పెరిగి పోయినవని, రిజిస్ట్రేషన్ విలువలు పెరిగినందున రియల్ ఎస్టేట్ రంగం కూడా మందగించిందని, రిజిస్ట్రేషన్ విలువల పెంపుదల నుంచి భీమవరం పరిసర ప్రాంతములకు మినహాయింపు ఇవ్వవలసినదిగా కోరుతున్నామన్నారు. దీనిపై ఎమ్మెల్యే అంజిబాబు మాట్లాడుతూ ఈ విషయంపై జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళతానన్నారు. చాంబరు ఆఫ్ కామర్స్ సభ్యులు మానేపల్లి సూర్యనారాయణ గుప్తా, కాగిత వెంకట రమణ, తుమ్మలపల్లి శివ, బుజ్జి, తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ అవుట్ పోస్ట్ ప్రారంభం


పోలీసు అవుట్ పోస్ట్‌ను ప్రారంభిస్తున్న ఎస్పీ అద్నాన్ నయీం అస్మి

భీమవరం: మహిళల భద్రత, దొంగతనాలను అరికట్టడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని దీనిలో భాగంగా భీమవరం బస్ కాంప్లెక్స్‌లో నూతనంగా పోలీస్ అవుట్ పోస్ట్‌ను ప్రారంభించినట్లు ఎస్పీ అద్నాన్ నయీం అస్మి చెప్పారు. మంగళవారం పోలీస్ అవుట్ పోస్ట్‌ను ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. పోలీస్ అవుట్ పోస్ట్‌లో నిత్యం పోలీసులు పని చేసేలా ఏర్పాట్లు చేస్తామన్నారు. అలాగే ప్రయాణికులకు అందుబాటులో ఉండే విధంగా పబ్లిక్ అడ్రెస్సింగ్ సిస్టం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. బస్ కాంప్లెక్స్ ప్రాంతంలో మహిళలు, కాలేజీ యువతులను ఈవ్‌టీజింగ్ నుంచి కాపాడేందుకు, దొంగతనాలు, గంజాయి రవాణా, విక్రయాలు జరకుండా ఉండేందుకు ఒక పీటీజెడ్ కెమెరాతో సహా మొత్తం 17 సీసీ కెమేరాలు ఏర్పాటు చేశామన్నారు. ఈ సందర్భంగా సీసీ కెమెరాలు ఏర్పాటు, పోలీస్ అవుట్ పోస్ట్ ను ఆధునీకరించడానికి సహకరించిన డీఎస్పీ ఆర్‌జీ జయ సూర్య, భీమవరం వన్ టౌన్ సీఐ ఎం.నాగరాజు, గ్రంధి సురేష్, బేతు కృష్ణారావు, ఎస్సై బీవై కిరణ్ కుమార్‌లను ఎస్పీ అద్నాన్ నయీం అస్మి అభినందించారు.

చెరువుల రిజిస్ట్రేషన్ పేరుతో దోపిడీ


కట్రెడ్డి మోహనరావు

ఆకివీడు: చెరువుల రిజిస్ట్రేషన్ పేరుతో మత్స్యశాఖ మండల అధికారులు చేతివాటం చూపిస్తున్నారని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు కట్రెడ్డి మోహనరావు ఆవేదన వ్యక్తం చేశారు. అప్పడా ఏర్పడిన తరువాత చెరువుల రిజిస్ట్రేషన్లు చేయించుకోవాలని ప్రభుత్వం సూచించడంతో వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వంలో వేలాది ఎకరాల చెరువుల రిజిస్ట్రేషన్ చేశారు. కాని ఇటీవల కాలంలో చెరువుల యజమానుల వద్ద నుంచి రూ.3 వేలు వసూలు చేస్తున్నారని, సొమ్ము చెల్లిస్తేనే రిజిస్ట్రేషన్లు చేస్తామని, లేకుంటే చేసే ప్రసక్తి లేదని చెబుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రిజిస్ట్రేషన్ కోసం రూ.1000 రశీదు చెల్లించాల్సి ఉండగా మరో రూ.2000 అదనంగా వసూలు చేస్తున్నారని ఆయన వాపోయారు. మండలంలో సుమారు తొమ్మిది వేల ఎకరాలకు పైబడి చెరువులున్నాయని ఒక్కో ఎకరం నుంచి అదనంగా రూ.2 వేలు వసూలు చేయడం ద్వారా కోట్లాది రూపాయలు మత్స్యశాఖ అధికారులు దోచేస్తున్నారని ఆరోపించారు. దీనిపై జిల్లా కలెక్టర్ స్పందించి, వెంటనే విచారణ చేపట్టాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

వీవోఏల సమస్యలు పరిష్కరించాలి


వీవోఏల దీక్షలో మాట్లాడుతున్న గోపిమూర్తి

భీమవరం: రాజకీయ పార్టీలకు ఓట్లు వేయించడానికి వీవోఏలు కావాలి తప్ప వారి సమస్యలను మాత్రం ప్రభుత్వం పట్టించుకోదని ఎమ్మెల్సీ బి.గోపిమూర్తి విమర్శించారు. వీవోఏలు చేపట్టిన దీక్షలను రెండో రోజు మంగళవారం ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రపంచ బ్యాంకు ఆదేశాలకు అనుగుణంగా పాలకులు ప్రజల సమస్యలను పక్కన పెట్టి కార్పొరేట్లకు ఊడిగం చేసే పనిలో ఉన్నారని ధ్వజమెత్తారు. వీవోఏల జిల్లా అధ్యక్షురాలు నిర్మలాదేవి మాట్లాడుతూ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగా మూడు రోజుల పాటు నిరాహార దీక్షలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పెద్ద సంఖ్యలో మహిళలు, డ్వాక్రా యానిమేటర్లు శాంతియుతంగా ఆందోళన చేస్తుంటే ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో గోవిందమ్మ, పుష్పలత, జ్యోతిరత్నం, కె.పార్వతి, ఎస్.హేమలత, అమర, సుధారాణి, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

భీమవరం: సబ్ స్టేషన్‌లో లైన్ మార్చే నిమిత్తం ఈ నెల 29వ తేది బుధవారం పలు చోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ డీఈ ఎస్.వెంకటేశ్వరరావు తెలిపారు. బుధవారం ఉదయం ఎనిమిది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ఏపీ టిడ్కో, తహసీల్దార్, జీఐఎస్, తాడేరు సబ్ స్టేషన్లకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు. భీమవరం అర్బన్, రూరల్, పాలకోడేరు మండలంలో విద్యుత్ ఉండదని ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

గ్రామాల అభివృద్ధిలో భాగస్వాములవుదాం

ఉండి: గ్రామాల అభివృద్ధిలో ప్రజా ప్రతినిధులు, అధికారులు భాగస్వాములు కావాలని ఎంపీడీవో ఎస్.రవీంద్ర అన్నారు. మంగళవారం ఉండి మండల పరిషత్ మీటింగ్ హాల్‌లో పంచాయతీ కార్యదర్శులు, ఎంపీటీసీలకు గ్రామాభివృద్ధిపై ఒక రోజు శిక్షణా శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడి, అనంతరం జాతిపిత మహాత్మాగాంధీ, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ వెంకటరెడ్డి, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

30న శాంతి ప్రదర్శనలు

భీమవరం : మహాత్మాగాంధీ 77వ వర్ధంతిని పురస్కరించుకుని ఈ నెల 30వ తేదిన ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో గాంధీ మండపాల వద్ద శాంతి ప్రదర్శనలు, సర్వమత ప్రార్థనలు నిర్వహించనున్నట్లు సర్వోదయ మండలి జిల్లా కార్యదర్శి ఇందుకూరి ప్రసాదరాజు చెప్పారు. సర్వోదయ మండలి ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమాల్లో స్వచ్ఛంద సంస్థలు, గాంధేయ వాదులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ప్రసాదరాజు కోరారు.

ఎమ్మెల్సీ గోపి మూర్తికి అభినందన

భీమవరం: ఉద్యోగ కార్మిక ఉద్యమాల సారథి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గోపి మూర్తిని అభినందిస్తూ సీఐటీయూ పశ్చిమగోదావరి జిల్లా కమిటీ సభ నిర్వహించింది. మంగళవారం స్థానిక అంబేద్కర్ భవనంలో జరిగిన అభినందన సభకు సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజా రామ్మోహన్‌రాయ్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా గోపి మూర్తికి పూల మొక్కను అందించి అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ గోపి మూర్తి, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర పాలకులు అనుసరిస్తున్న విధానాలు ఉద్యోగ శ్రామిక ప్రజలకు తీవ్ర నష్టం చేసేవిగా ఉన్నాయని వాటిని ప్రజలకు వివరిస్తూ చట్ట సభల్లో ప్రశ్నించే గొంతుక అవసరమవుతుందన్నారు. కార్యక్రమంలో జేఎన్వీ గోపాలన్, బి.వాసుదేవరావు, ఆకుల హరేరామ్, జక్కంశెట్టి సత్యనారాయణ, మామిడిశెట్టి రామాంజనేయులు, కె.రూనీ లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ప్రకాశం పంతులు విగ్రహం ఏర్పాటు చేయాలి


ప్రకాశంచౌక్‌లో విద్యార్థులతో ప్రదర్శన దృశ్యం

భీమవరం: మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా జిల్లా సర్వోదయ మండలి, శ్రీవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ప్రకాశం పంతులు విగ్రహం నెలకొల్పాలని కోరుతూ ప్రకాశంచౌక్ సెంటర్‌లో మంగళవారం ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా సర్వోదయ మండలి కార్యదర్శి ఇందుకూరి ప్రసాదరాజు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఇందుకూరి సుబ్రహ్మణ్యంరాజు మాట్లాడుతూ నేటి యువత మహాత్మాగాంధీ అడుగు జాడల్లో నడవాలన్నారు. టంగుటూరి ప్రకాశం పంతులు నడవడిన భీమవరం పట్టణంలోని ప్రకాశంచౌక్‌లో ప్రకాశం పంతులు విగ్రహాన్ని ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రజా నాట్య మండలి సభ్యులు ఎస్‌కే చాన్‌భాషా, చెరుకువాడ రంగసాయి, పెండ్యాల సరిత, పెన్మెత్స సత్యనారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణానికి దరఖాస్తు చేసుకోవాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో

వీరవాసరం: గృహ నిర్మాణానికి అర్హులైన లబ్ధిదారులు ఈ నెల 30వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో కె.రవికిరణ్ తెలిపారు. వీరవాసరం ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం నుంచి స్థలం పొందిన వారు, సొంత స్థలం ఉన్న వారు ఇళ్ల నిర్మాణానికి దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఆధార్ కార్డు, రేషన్ కార్డు, కుటుంబ సభ్యుల వివరాలతో కూడిన దరఖాస్తు నింపి ఆన్లైన్ లో అప్లై చేసుకోవాలని సూచించారు. ఇంటి స్థలం లేని వారు సైతం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. దరఖాస్తులు చేసుకున్న అర్హులకు గృహ నిర్మాణానికి నిధులు విడుదల చేస్తామన్నారు. ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ సిబ్బంది, గ్రామస్తులు సహకరించాలన్నారు. ఎంపీపీ వీరవల్లి దుర్గా భవాని, హౌసింగ్ ఏఈ కె.శ్రీరామ చంద్రమూర్తి, రాయపల్లి వెంకట్, పీతల సుబ్రహ్మణ్యం, వీరవల్లి చంద్రశేఖర్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.